ఎంత ఉపయోగమో..!

- యోగాపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి
- సాధనకు ప్రాధాన్యతనిస్తున్న యువత
- మానసిక ప్రశాంతతకు దోహదం



దూబచర్లలో యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

దేవరపల్లి: యోగా పట్ల ప్రజల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం అరగంట యోగా చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి వ్యక్తి లక్ష్య సాధనకు తోడ్పడుతుందని యోగా గురువులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో యోగాను విద్యలో ఒక భాగం చేయాలని ఆకాంక్షిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు ప్రతి పాఠశాలలో యోగ పాఠ్యాంశంగా ఉండాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. దేవరపల్లిలో ప్రతి నిత్యం సుమారు 400 మంది యువతీ, యువకులు, విద్యార్థులు యోగా సాధన చేస్తూ మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటున్నారు. మండలంలోని రామన్నపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ దేవరపల్లిలో ఉచిత యోగా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి యువకులకు యోగాలో తర్ఫీదు ఇస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఒత్తిడిని దూరం చేసి మానసిక ప్రశాంతతకు యోగా దోహదపడుతుందని సాధకులు చెబుతున్నారు. గత 10 ఏళ్లుగా దేవరపల్లిలో పూర్ణ యోగా ఆశ్రమం స్థాపించి రామచంద్ర గురూజీ యోగాపై శిక్షణ ఇస్తున్నారు. మహిళలు కూడా దీనిపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

ఉద్వేగాలను నియంత్రిస్తుంది

యోగా అనవసర ఆలోచనలు, ఉద్వేగాలను నియంత్రించి ఏకాగ్రతను పెంచి, ప్రశాంతత కలిగిస్తుంది. నేటి జీవన పద్ధతులు, అవిశ్రాంత కార్యకలాపాలు, శరీరం, మనసుపై విపరీతమైన ఒత్తిడి కలగజేస్తున్నాయి. శరీరం, మనసును ఎప్పుడూ ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంచడానికి యోగ దోహదపడుతుంది. శ్రద్ధ, సహనం ఆ రెండు యోగా అభ్యసనకు కావాల్సిన ముఖ్య లక్షణాలు. నేటి పరిస్థితుల్లో 70 నుంచి 80 శాతం ప్రజలు మధుమేహం, మెడ, నడుంనొప్పి, థయాటిక్ నొప్పి, ఊబకాయం, అధిక బరువు వంటి ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నారు. మధుమేహం ఉన్న వారు అర్ధమతేస్ యంద్రాసనం, వజ్రాసనం, ధనురాసనం, పశ్చిమోత్తాసనం వేయాలి. సయాటికా నొప్పి, నడుంనొప్పి, మెడ నొప్పులు ఉన్న వారు నీరాలంభ బూసనం, భుజంగాసనం, శలపాసనం , ధనురాసనం సాధన చేయాలి. వీరు ముందుకు వంగి ఆసనాలు వేయకూడదు. అధిక బరువు, ఊబకాయం ఉన్నవారు అర్ధమత్స్యేద్రాసనం, పశ్చిమోత్తసనం, ధనురాసనం, చక్రాసనం, నౌకాసనం, పాదహస్తాసనం, ఉష్టాసనం, సేతుబంధనంలో ఒకటి రెండు ఆసనాలు వేయాలి. థైరాయిడ్ గ్రంథి సమస్య ఉన్న వారు హలాసనం, సర్వాగ అసనాలను సాధన చేయాలి. యోగాసనాల వల్ల కాలేయం, మూత్రపిండాలకు ఉత్తేజం వస్తుంది. గుండె కొట్టుకునే వేగం తగ్గి పనితనం పెరుగుతుంది. వెన్నెముకకు మంచి వ్యాయామం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. ఛాతీ విశాలం అవడంతో పాటు, పొట్ట, నడుం చుట్టూ ఉండే కొవ్వు కరుగుతుంది. మలబద్ధకం, కీళ్ల నొప్పులు తగ్గుతాయి. గర్భాశయం, మూత్రాశయాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఒక ఆసనాన్ని ఇంత సమయమే చేయాలనే నిబంధన ఎక్కడా లేదు. ఎవరైనా చేయవచ్చు. ప్రతి ఒక్కరూ యోగాసనాలు సాధన చేయాలని రవీంద్రనాథ్ తెలిపారు. దేవరపల్లి మండలం చిన్నాయగూడెంకు చెందిన అర్మిత భవానీ చౌదరి అంతర్జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపి తృతీయ స్థానం సాధించారు.

నిరంతర సాధన ఉండాలి

యోగాను పాఠ్యాంశంలో చేర్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాను. ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు యోగా తప్పనిసరిగా సాధన చేయించాలి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, పాఠశాలల్లో యోగా నిరంతర సాధనగా ఉండాలి. గ్రామ స్థాయిలో యోగా పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. దీనికి ప్రత్యేక ప్రణాళిక అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడిప్పుడే యోగా పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతుంది. సాధన మొక్కుబడి కాకూడదు. విద్యాసంస్థల్లో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలి. ప్రతి వ్యక్తి మానసిక ఉల్లాసంగా ఉండాలంటే యోగా తప్పనిసరి.

– పేరం రవీంద్రనాథ్, శాప్ డైరెక్టర్, దేవరపల్లి



వజ్రాసనం వేసిన పేరం రవీంద్రనాథ్



హనుమాన్ వాల్మికి ఆసనం వేసిన అర్మిత భవానీ చౌదరి



ధనురాసనం వేసిన యువతి

నిరుద్యోగ భృతి ఇచ్చేదెప్పుడు?



చిడిపిలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' రచ్చబండలో పాల్గొన్న తలారి వెంకట్రావు, నాయకులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తలారి వెంకట్రావు
- చిడిపిలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ రచ్చబండ కార్యక్రమం

తాళ్లపూడి (కొవ్వూరు): నిరుద్యోగులకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి 15 నెలలు కావస్తున్నా ఇవ్వకుండా చంద్రబాబు మోసాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని చిడిపిలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటిని తుంగలోకి తొక్కుతూ, అమలు చేసే కొన్ని హామీలను కూడా నామమాత్రంగా చేస్తున్న చంద్రబాబు మోసగాడు కాదా అని అన్నారు. లక్షలాది ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను తొలగించారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వల్లశెట్టి శ్రీనివాస్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పరిమి సోమరాజు, గ్రామ నాయకుడు పామేర్ల నగేష్, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ కవల నాగేశ్వరరావు, పార్టీ ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, తిగిరిపల్లి వెంకట్రావు, ఉప్పులూరి సూరిబాబు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



త్యాజంపూడిలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'లో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు సతీష్

దేవరపల్లి: చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పించడానికి బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ పేర్కొన్నారు. మండలంలోని త్యాజంపూడిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతుల కృష్ణారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సతీష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికి ఒక్క కొత్త పింఛన్ మంజూరు కాలేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు చేశారన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసి 2029 ఎన్నికల్లో పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ, ప్రచార ఆర్భాటంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. అక్కచెల్లెమ్మల సొంతింటి కల నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ మోసాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం హింసిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ రూపొందించిన డిజిటల్ బుక్ కార్యకర్తలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. తొలుత దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సత్తి సాయి ఈశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కుసులూరి వెంకట సతీష్, రైతు విభాగం మండల అధ్యక్షుడు పల్లి రత్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పల్లి రాంబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కాకర్ల శోభన్ కుమార్, పార్టీ నాయకులు ఉస్సే రవి, తణుకు వెంకట్రావు, మరపట్ల వీర్రాజు, గాలం నాగు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గేదెలు చనిపోతున్నా చర్యలు తీసుకోరా?



ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు

తాళ్లపూడి: మూగజీవాల ఆరోగ్యం పట్ల, పెద్దేవం గ్రామంలోని కలుషితమైన సుఘంది చెరువు పట్ల సత్వర చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వం, అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు ప్రశ్నించారు. కొద్ది రోజులుగా పాడి గేదెలకు అంతుచిక్కని వ్యాధితో వరుసగా వ్యాధి బారిన పడుతున్నాయన్నారు. దీనిపై అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. గేదెలకు వరుసగా అనారోగ్యం ఎందువల్ల ఏర్పడుతుందన్న విషయాలు తెలిపే టెస్ట్ రిపోర్ట్‌లు ఎందుకు వెల్లడించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వచ్చి వెళ్లిన తరువాత గేదెలకు ఇన్సూరెన్స్ చేయించాలన్న విషయంలో రైతులను ఎందుకు ప్రోత్సహించట్లేదని ఆయన ప్రశ్నించారు. గేదెల అనారోగ్యం వల్ల రూ.60 లక్షల పైనే ఆస్తి పరోక్షంగా పోగొట్టుకున్నారని, మిగిలిన గేదెలకు ఇన్సూరెన్స్ కల్పిస్తే కొంత నష్టాన్ని తగ్గించినట్లు అవుతుందన్నారు. చెరువు విషయానికొస్తే గత ఆరేళ్లుగా పంచాయతీ ఆదాయం పోయిందని, కనీసం గేదెలు నీళ్లు తాగేందుకు కూడా వీలు లేక నిరుపయోగంగా మారిందన్నారు. ప్రజలకు, పంచాయతీలకు ఉపయోగపడేలా నీటిని శుభ్రం చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

లైసెన్స్ లేకుండా షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు



పెరవలిలో మందుగుండు సామాగ్రి షాపును పరిశీలిస్తున్న ఆర్డీవో సుస్మిత

పెరవలి: దీపావళి సామాగ్రి అమ్మే షాపు యజమానులు లైసెన్స్ లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. పెరవలిలో దీపావళి హోల్‌సేల్ మందుగుండు సామాగ్రి షాపుపై పోలీసులు, రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి దాడి చేసి షాపును సీజ్ చేశారు. లైసెన్స్ లేకుండా అక్రమంగా అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణపై షాపును సీజ్ చేసి మంగళవారం లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ షాపును పరిశీలించి మందుగుండును తూకం వేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పిట్టల వేమవరంలో మందుగుండు తయారీ కేంద్రానికి వెళ్లి తనిఖీలు చేశారు. షాపు యజమాని మాత్రం తాను లైసెన్స్ రెన్యూవల్ చేయటానికి దరఖాస్తు చేసుకున్నానని, ప్రస్తుతం ఆర్డీవో కార్యాలయంలో ఉందని తెలిపారు. షాపులో అదనపు మందుగుండు సామాగ్రి లేదని, లైసెన్స్ ప్రకారమే మందుగుండు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకం



రాగోలపల్లి కొండపై ఎర్ర గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయిన్

తాళ్లపూడి: కూటమి ప్రభుత్వంలో ఇసుక, మట్టి దోపిడి జరుగుతుంది. నిబంధనలు పాటించడం లేదు. అధికారులు చూసి చూడనట్టు వ్యహరిస్తున్నారు. మండలంలోని రాగోలపల్లిలో కొండపై ఉన్న భారీ చెట్లను నరికివేయడంతో పాటు, ఎర్ర మట్టిని తవ్వుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సాధరణంగా మట్టి తవ్వటానికి, తరలించడానికి కొన్ని నిబంధనల మేరకు అధికారుల అనుమతులు తీసుకోవాలి. కానీ తాళ్లపూడి మండలంలో మాత్రం ఎర్ర మట్టి, ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి తరలింపులో రెవెన్యూ అధికారుల నియంత్రణ ఏ మాత్రం లేదు. తాళ్లపూడి మండలంలో చింతలపూడి ఎత్తిపోతలకు చెందిన కాలువ గట్లు వెంబడి మట్టిని తరలించేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాగోలపల్లిలో కొండను మిషన్లతో తవ్వేస్తున్నారు. కలప కూడా తరలించేస్తున్నారని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నా ఎవరు పట్టించుకోలేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక అధికారులు పట్టించుకోలేదని ఎమ్మెల్యేని ఆశ్రయించినట్లు సమాచారం.

ఇసుకపై పర్యవేక్షణ కరవు

మండలంలోని ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కరవైంది. దీంతో నిబంధనలు ఏ మాత్రం అమలు జరగడం లేదు. టన్ను రూ.145 మాత్రం విక్రయించాల్సిన ఇసుక రూ.250కి పైగా అమ్ముతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్టాక్ పాయింట్ల వద్ద పాటించాల్సిన నిబంధనలు అమలు కావట్లేదని స్థానికులు అంటున్నారు.

ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోండి



ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలజ

నల్లజర్ల: మారుతున్న వాతావరణ పరిస్థితులపై ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన ఇళ్లను సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులు వాకబు చేయాలని పోతవరం పీహెచ్‌సీ డాక్టర్ శైలజ సూచించారు. మంగళవారం పోతవరం పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో వివిధ అంశాలపై ఆమె మాట్లాడారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కలిగించాలన్నారు. మరుగుదొడ్ల సక్రమ వినియోగం, భోజనానికి ముందు చేతుల పరిశుభ్రం చేసుకోవడంపై వివరించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కె.కృష్ణకుమారి, హెచ్‌వీ జె.మీరాబాయి, సూపర్‌వైజర్ జయప్రకాష్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అత్యవసర ఇంజెక్షన్‌లు

నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము కాటు ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని ఇన్‌చార్జ్ డాక్టర్ మనోజ్ తెలిపారు. వర్షాకాలం కావడంతో పొలాల్లో పాముల సంచారం ఎక్కువగా ఉంటుందని, రైతులు వాటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొరపాటున ఎవరైనా పాము కాటుకు గురైతే సంబంధిత ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

నేడు రీ ప్లాంటేషన్‌పై అటవీ అధికారులతో సమావేశం

కడియం: భారీ వృక్షాలను రీప్లాంటేషన్ చేసే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో)తో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప తెలిపారు. కడియపులంకలోని నర్సరీ అసోసియేషన్ కార్యాలయలలో జరిగే సమావేశానికి రైతులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

గంగాలమ్మ తల్లికి పూజలు

సీటీఆర్ఐ: స్థానిక కోటిలింగాల ఘాట్ వద్ద గంగపుత్రులందరూ కలసి ఛత్రపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గంగాలమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. గోదావరి నదిపై ఆధారపడి జీవించేవారు మొసలి వాహనంపై గంగాలమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మంగళవారం అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులుపాల్గొన్నారు.

క్లుప్తంగా

నిడదవోలుకు స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు



కృష్ణవేణికి అవార్డును అందజేస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు: స్వచ్ఛాంధ్రలో భాగంగా జిల్లా స్థాయిలో నిడదవోలుకు స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు దక్కింది. రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుల చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణిలు స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డును అందుకున్నారు. పట్టణంలో పరిశుభ్రత, వ్యర్థ నిర్వహణ, ప్రజా అవగాహన కార్యక్రమాల్లో విశేష ఫలితాలు సాధించి, జిల్లా స్థాయిలో నిడదవోలు ముందంజలో ఉంది. కలెక్టర్ మాట్లాడుతూ, నిడదవోలు మున్సిపాలిటీ పరిశుభ్రత కార్యక్రమాల్లో చూపిన కృషి ఇతర పట్టణాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

నేడు క్రీడా జట్ల ఎంపిక

దేవరపల్లి: స్థానిక అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 బాలబాలికల మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తిరుమలదాస్, మండల పాఠశాలల క్రీడల కన్వీనర్ ఆచంట వెంకటేశ్వరరావు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఉదయం 9 గంటలకు హైస్కూల్ క్రీడా ప్రాంగణానికి చేరుకుని రిపోర్ట్ చేయాలని ఎంఈఓ తిరుమలదాస్ తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ప్రముఖ క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలన్నారు. ప్రతి గేమ్‌కు కనీసం ఇద్దరు, ముగ్గురు క్రీడాకారులు పాల్గొనాలని ఆయన తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్‌తో పాటు అథ్లెటిక్స్ జరుగుతాయని పేర్కొన్నారు.

పోతవరం పీహెచ్‌సీ డాక్టర్‌గా శైలజ



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ శైలజ

నల్లజర్ల: పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టరుగా సీహెచ్ శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ రాజశేఖర్ విజయవాడ బదిలీ అయ్యారు. డాక్టర్ శైలజ గుంటూరు జిల్లా చేబ్రోలు పీహెచ్‌సీలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కొవ్వూరుకు చెందిన ఆమె ఏలూరు, నిడదవోలు, మాధవరం పీహెచ్‌సీల్లో పని చేశారు.

విద్యార్థులకు పాటల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాలోత్సవం కమిటీ సభ్యులు

దేవరపల్లి: గురజాడ అప్పారావు 110వ వర్ధంతి, ఎల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి సందర్భంగా దేవరపల్లి మండల బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాటల పోటీల్లో భాగంగా మంగళవారం మండలంలోని రామన్నపాలెం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 100 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపగా, సత్తిరెడ్డి మేఘన, సోమిశెట్టి ప్రియదర్శిని, లంక నవ్యశ్రీదుర్గ, ఎర్రగొల్ల భవానీ, బొందల భాగ్యశ్రీ సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు బాలోత్సవం కమిటీ సభ్యులు ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సుభాష్ చంద్రబోస్, జడ్డు అనిల్, నలమాటి లలిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి వేములు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండిస్తూ నిరసన

నిడదవోలు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడాన్ని నిరసిస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, మనువాదం తెరకెక్కించుకున్న న్యాయవాది కోర్టులో వాదనలు జరుగుతున్న సమయంలో అదుపు కోల్పోయి కోర్టు ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించి గవాయ్‌పై దాడికి యత్నించడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అన్నారు. న్యాయమూర్తులకే రక్షణ లేకపోతే దేశంలో సాధారణ పౌరుల స్థితి ఎంటో ఊహించవచ్చన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ, జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండించారు. కార్యక్రమంలో మల్లిడి రామిరెడ్డి, లంకాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

గేదెల సమస్యపై వెంకట్రావుకు వినతిపత్రం అందజేత



తలారి వెంకట్రావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తాళ్లపూడి: పెద్దేవంలో కొద్ది రోజులుగా అంతు చిక్కని వ్యాధితో గేదెలు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాలని మంగళవారం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, పాడి రైతులు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తలారి వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. తమకు నష్టపరిహారం వచ్చేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు 41 గేదెలు వ్యాధి బారిన పడ్డాయని, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు పర్యటించినా వ్యాధిని అదుపులోకి తీసుకురాలేదన్నారు. ఇప్పటి వరకు బీమా కూడా చేయించలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి దీనిని రాష్ట్ర సమస్యగా భావించి తమకు న్యాయం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు శింగుకూరి శివగంగాధర్, మైలవరపు రాధాకృష్ణ తదితరులున్నారు.

పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తల ఆందోళన



నల్లజర్ల పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

నల్లజర్ల: గత 20 ఏళ్లుగా పేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలు కనీస వేతనాలకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమని సీఐటీయూ జిల్లా నాయకులు కె.వెంకట్రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అధికారంలోకి వస్తే కనీస వేతనాలు అందిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తట్లేదన్నారు. నాణ్యమైన యూనిఫాం అందించాలని, జాతీయ పండగలు, వారాంతపు క్యాజువల్ సెలవులు ఇవ్వాలని, టీఏ, డీఏలు అందించాలని, రికార్డులతో పనిలేని పనులు మాత్రమే చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు తక్షణం పరిష్కరించకుంటే నవంబరులో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామన్నారు. ఈ ఆందోళనలో యం.జయమ్మ, యన్.శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత



దుద్దుకూరులో క్రీడాకారులకు దుస్తులు అందజేసిన పైడియ్య

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు రంగరాయ జిల్లా పరిషత్ హైస్కూల్లో పని చేసి రిటైర్ అయిన యెల్లపు పైడియ్య క్రీడాకారులకు ఉచితంగా క్రీడా దుస్తులు అందజేశారు. దుస్తులను మంగళవారం ప్రధానోపాధ్యాయులు వీర్రాజు సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. సుమారు రూ.15 వేల వ్యయంతో దుస్తులు కొనుగోలు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.రామ్‌కుమార్, అల్లూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో అన్నసమారాధన

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని మేదరపేటలో మంగళవారం విజయదశమి వేడుకలు ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. గత 15 ఏళ్ల నుంచి వేడుకలు నిర్వహిస్తున్నారు. మేదర సంక్షేమ సంగం, మహేంద్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నసమారాధనలో 3 వేల మంది పాల్గొన్నారు.